MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 171 | ఆదివారం 25 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# జడ్పీటీసీ బరిలో 4,770 మంది

## ఎంపీటీసీ ఎన్నికల్లో 46,045 మంది పోటీ

## పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడించిన ఎన్నికల కమిషన్

## ప్రచారానికి సిద్ధమవుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు




**(అంకుశం, అమరావతి, అక్టోబరు 25):**

రాష్ట్రంలో జరుగనున్న మండల పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూయన్సీ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూయన్సీ (జెడ్పీటీసీ) ఎన్నికలకు వాలిడ్‌గా నామినేట్ అయిన అభ్యర్థుల వివరాలు శనివారం వెల్ల ఎన్నికల కమిషన్ వెల్లడించింది. 28 జిల్లాల్లోని 9,829 ఎంపీటీసీలు, 659 జెడ్పీటీసీలకు పోలింగ్ జరగనుంది. ఎంపీటీసీలకు మొత్తం 46,045 మంది అభ్యర్థులు, జడ్పీటీసీలకు 4,770 మంది అభ్యర్థులు వాలిడ్‌గా నామినేట్ అయ్యారు. ఎంపీటీసీల్లో పార్టీల వారీగా అభ్యర్థులను పరిశీలిస్తే టీడీపీ: 19,760, వైఎస్సార్‌సీపీ: 17,726, జనసేన: 4,330, బీజేపీ: 1,049, కాంగ్రెస్: 439, సీపీఐ(ఎం): 353, బీఎస్పీ: 155, ఏఏపీ: 2, ఇతర పార్టీలు: 219, స్వతంత్ర అభ్యర్థులు 2,012 మంది పోటీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీల వారీగా అభ్యర్థులను పరిశీలిస్తే.. టీడీపీ: 1,693, వైఎస్సార్‌సీపీ: 1,445, జనసేన: 587, కాంగ్రెస్ 316, స్వతంత్రులు: 227, బీజేపీ: 227, బీఎస్పీ: 122, ఇతర పార్టీలు: 74, సీపీఐ(ఎం): 69, ఏఏపీ: 10 మంది పోటీలో ఉన్నారు. జిల్లాల వారీగా చూస్తే ఎంపీటీసీల్లో అత్యధికంగా శ్రీకాకుళం (2,806), విజయనగరం (2,511), అనకాపల్లి (2,394), ఏలూరు (2,310), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు (2,231) జిల్లాల్లో అభ్యర్థులు నామినేట్ అయ్యారు. జెడ్పీటీసీల్లో తిరుపతి (280), విజయనగరం (254), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు (250), శ్రీ సత్యసాయి (234), అనకాపల్లి (228) జిల్లాలు ముందున్నాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అధిక సంఖ్యలో పోటీ చేస్తుండగా, జనసేన, కాంగ్రెస్, బీజేపీలు కూడా గణనీయమైన సంఖ్యలో అభ్యర్థులను నిలబెట్టాయి.

# విజయనగరం కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతా

## అధికారులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం

**(అంకుశం, విజయనగరం, అక్టోబర్ 25):**

విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి పేరు,ఫోటోతో గుర్తుతెలియని వ్యక్తి నకిలీ వాట్సాప్ ఖాతాను సష్టించి, పలువురికి సందేశాలు పంపిస్తూ డబ్బులు కోరుతున్నట్లు కలెక్టర్ దష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ పేరుతో డబ్బులు కోరుతూ వచ్చే అనుమానాస్పద వాట్సాప్ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయవద్దని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దీనిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని




# రెండు రోజులు తుపాను తీవ్రత హెచ్చరికలు జారీ

## సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

**(అంకుశం, అమరావతి, అక్టోబరు 25):**




బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో హోంమంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం బాపట్ల--విశాఖపట్నం తీరాల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని, అవసరమైతే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్,ఎస్డీఆర్ఎఫ్ బందాలను సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హోంమంత్రి సూచించారు. బీచ్‌లలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలో భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, ఇతర ప్రమాదకర కార్యకలాపాలకు పాల్పడటం వంటివి చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావం దష్ట్యా రైతులు, ప్రజలు తమ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) జారీ చేసే అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## యువ క్రికెటర్లను తయారు చేయడమే

# ఆర్డిటి ధ్యేయం

## అనంతలో ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ పేస్ కార్యక్రమం

## అనంతపురం, రాప్తాడు నియోజకవర్గ యువ క్రికెటర్లు హాజరు

## మచ్చా రామలింగారెడ్డి చైర్మన్, ఆర్.డీ.టి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ





# క్రిప్టో ఆస్తులు, ఏఐపై ప్రత్యేక దృష్టి

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సమగ్ర అధ్యయనం చేపట్టనుంది. క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, కరెన్సీ నిర్వహణ, బ్యాంకింగ్, బీమా, పన్నుల సంస్కరణలు సహా మొత్తం 46 అంశాలను 2026–27 ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. ఈ క్రమంలో ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘానికి బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు–ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, రెవెన్యూ, ఆర్థిక సేవల విభాగాలతో పాటు మరికొన్ని కీలక సంస్థలకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది. ధరల స్థిరత్వం, రూపాయి విలువ, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం వంటి అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా రంగాల్లో విధానాల అమలు, పనితీరు, సంస్కరణల అవసరాన్ని అంచనా వేయడం ఈ అధ్యయనాల ప్రధాన ఉద్దేశం.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వర్చువల్ డిజిటల్ ఆస్తులపై కమిటీ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. క్రిప్టో ఆస్తులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, వాటి భవిష్యత్తు, ఈ రంగంలో అనుసరించాల్సిన విధానాలపై పరిశీలన చేపట్టనుంది. ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగం వల్ల కలిగే అవకాశాలు, ఎదురయ్యే సమస్యలను కూడా అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్,



ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీలు వంటి విభాగాల్లో కొత్త సాంకేతికత వినియోగం పెరుగుతున్నందున సంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అదే సమయంలో ఆర్థిక రంగంలో నియంత్రణ వ్యవస్థల పనితీరు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ఉన్న నియంత్రణ లోపాలను పరిశీలించనుంది. ఈ రంగాల్లో తగిన పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించిన అంశాలపై కూడా నివేదిక రూపొందించనుంది.

**ధరల స్థిరత్వం కరెన్సీ నిర్వహణ**

దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వం, కరెన్సీ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి సంబంధించి అనుసరిస్తున్న వ్యూహాలు, ఎదురవుతున్న సవాళ్లను కమిటీ సమీక్షించనుంది. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితులను విశ్లేషించడంతో పాటు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పాత్రను కూడా పరిశీలించనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల పనితీరు, ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాధాన్యం వంటి అంశాలపై అధ్యయనం చేపట్టనుంది. ప్రభుత్వ రంగ ఆస్తుల నగదీకరణ ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకునే విధానాలనూ పరిశీలించనుంది. ఇక బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరుతో పాటు అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత కల్పించే అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు, ఫలితాలను సమీక్షించనుంది.

**జీఎస్‌టీ, ప్రత్యక్ష పన్నుల సంస్కరణలు**

పన్నుల విధానంలో మార్పులు, సంస్కరణలకు సంబంధించిన అంశాలు కూడా కమిటీ పరిశీలనలో ఉన్నాయి. కస్టమ్స్ సుంకాలు, వస్తు–సేవల పన్ను (జీఎస్‌టీ), ప్రత్యక్ష పన్నుల వ్యవస్థల్లో చేపట్టాల్సిన మార్పులపై అధ్యయనం చేయనుంది. పన్నుల విధానాలు ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ ఆదాయంపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్కరణల అవసరాన్ని అంచనా వేయనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరును కూడా సమీక్షించనుంది. ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలు ఈ పరిశీలనలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.

**కంపెనీల నిర్వహణ, ఆడిటర్ల బాధ్యతలు**

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కమిటీ అధ్యయనం చేయనుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కంపెనీల ఈ–గవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనం వంటి అంశాలను కూడా పరిశీలించనుంది. కంపెనీల పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ అధ్యయనాలు ఉపయోగపడే అవకాశం ఉంది.

**నీతి ఆయోగ్, ఆర్థిక గణాంకాలపై సమీక్ష**

రంగాలవారీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో నీతి ఆయోగ్ పాత్రను కమిటీ పరిశీలించనుంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును కూడా సమీక్షించనుంది. గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ ఖాతాల గణాంకాలపై అధ్యయనం చేపట్టనుంది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించనుంది.

# రాహుల్ ఓట్ చోరీ ర్యాలీ సిక్కుల గాయాలపై కారం చల్లడమే

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలపై కారం చల్లే ఉద్దేశంతో ఢిల్లీలో నవంబరు 1న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారని బీజేపీ ఆరోపించింది. ర్యాలీ నిర్వహణపై ఇండి కూటమిలోని పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదని విమర్శించింది. ర్యాలీ వాయిదా వేయాలని కోరుతున్నప్పటికీ, ఎవరు చెప్పినా రాహుల్ మాట వినడం లేదని దుయ్యబట్టింది. తన పంతం నెగ్గించుకునేందుకు రాహుల్? ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. సిక్కు సమాజం మనోభావాలను పట్టించుకోవడం లేదనేదే కాంగ్రెస్ సందేశమని ఆయన ఆరోపించారు. ఢిల్లీ పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



**‘సీఈసీని పదవినుంచి తొలగించాలి’**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్?ఐఆర్?)లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చలో ఢిల్లీ పేరిట నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ తలపెట్టనుంది. ఓటు చోరీకి వ్యతిరేకంగా దాదాపు 10 లక్షల మందితో ఈ నిరసన కవాతు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్? కుమార్(సీఈసీ)ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ తలపెట్టనున్నట్లు పేర్కొంది. ఆ ర్యాలీలో జనం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఇప్పటికే సీఈసీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించడంతో పాటు, పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ప్రదర్శనగా వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రతిపక్ష నేతలు కలిశారు.

**ర్యాలీతో చిరువ్యాపారులకు ఇబ్బందులు**

పండుగ సీజన్ వేళ ఢిల్లీలో ర్యాలీ తలపెట్టడం వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరగాల్సిన పార్టీ ర్యాలీని నవంబర్ 10 తర్వాతకు వాయిదా వేయాలని కోరుతూ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) శనివారం రాహుల్ గాంధీకి లేఖ రాసింది. లేఖలో, ఈ ఏడాది నవంబర్ 10న వచ్చే భాయ్ దూజ్ తర్వాత మరో తేదీకి ర్యాలీని వాయిదా వేయాలని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ అభ్యర్థించారు. ధంతేరస్, దీపావళి, భాయ్ దూజ్ పండుగలు ఢిల్లీ రిటైల్ మార్కెట్లకు అత్యంత అనువైన సమయమని వ్యాపారుల సంఘం పేర్కొంది. ఆ సమయంలో వ్యాపారులు పండుగ కొనుగోళ్లు, అమ్మకాలను చాలా ముందుగానే ప్రారంభిస్తారని నొక్కి చెప్పింది. బంగారం, వెండి, పాత్రలు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, ఆటోమొబైల్స్, ఫర్నిచర్ ఇతర వస్తువుల వంటి రంగాలను కలుపుకొని, కేవలం ధంతేరస్ సందర్భంగానే ఢిల్లీలో సుమారు రూ. 25,000 కోట్ల విలువైన వ్యాపారం జరుగుతుందని అంచనా వేసింది.

**ఇందిరా గాంధీ హత్యతో సిక్కు వ్యతిరేక అల్లర్లు**

ఇదిలా ఉండగా, 1984 అక్టోబర్ 31న అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హత్యకు గురైన తర్వాత, ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి. చాలా మంది బాధితులు అల్లర్లలో తీవ్రంగా గాయపడ్డారు.

# భారత్‌లో వారిని చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి

**ఆ జ్ఞాపకాలు ఎప్పుడూ నాతోనే ఉంటాయి**

**పోలాండ్ ప్రధాని**

**దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న కేంద్రానికి వెళ్లిన డొనాల్డ్ వారిని చూసి చలించిపోయారు.**

‘జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, పరిస్థితులు ఎంతలా మారినా మదిలోని కొన్ని జ్ఞాపకాలు మాత్రం ఏళ్ల తరబడి మనతోనే ఉంటాయి. ఏ కాలం ఏ విధి వాటిని మన నుంచి దూరం చేయలేవు’ అని అంటారు. సరిగ్గా పోలాండ్? ప్రధానమంత్రి డొనాల్డ్ టుస్క్‌కి అదే జరిగింది. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన ఆయనకు ఓ మధురాతి అనుభవం ఎదురైంది. 16 సంవత్సరాల క్రితం భారత్?ను సందర్శించినపుడు జరిగిన భావోద్వేగభరితమైన సంఘటనను ఆయన గుర్తుచేసుకున్నారు.

**ఇంతకీ అదేంటంటే!**

ఫ్రాన్స్, పోలండ్‌కు చెందిన కొంతమంది ఏర్పాటుచేసిన అంధుల సంరక్షణ కేంద్రాన్ని 16 ఏళ్ల క్రితం బెంగళూరు పర్యటనకు వచ్చిన డొనాల్డ్ టుస్క్ సందర్శించారు. దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న కేంద్రానికి వెళ్లిన డొనాల్డ్ వారిని చూసి చలించిపోయారు. తాజాగా మళ్లీ భారత్ పర్యటనకు వచ్చిన టుస్క్ మరోసారి ఆ కేంద్రాన్ని సందర్శించారు. పోలండ్ జాతీయగీతంలోని పదాలను పిల్లలు గుర్తుంచుకోవడాన్ని చూసి టుస్క్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాసేపు ఆ పిల్లలతో ముచ్చటించారు. అలాగే, అప్పటి వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.అందులో “సరిగ్గా 16 ఏళ్ల క్రితం ఈ కేంద్రాన్ని పోలండ్ ప్రతినిధి బృందంతో కలిసి నేను ఈ కేంద్రాన్ని సందర్శించాను. ఆ సమయంలో చిన్నారులు మా దేశ జాతీయగీతం పాడటం చూసి ఆశ్చర్యపోయాం. పిల్లలు



పోలిష్ జాతీయ గీతాన్ని పాడినప్పుడు మా కళ్లలో నీళ్లు తిరిగాయి. నేడు వారంతా పెద్దవారయ్యారు. కానీ వారికి ఇప్పటికీ ‘మజురెక్ డాబ్రోవ్స్కిగో’ (పోలిష్ జాతీయ గీతం)లోని పదాలు గుర్తున్నాయి. ఈరోజు వారిని చూసిన తర్వాత కళ్లలో నీళ్లు తిరిగాయి” అని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. టుస్క్ పోస్ట్ చేసిన వీడియోలో గులాబీ రంగు దుస్తులు ధరించిన పిల్లలు పోలాండ్ జాతీయ గీతం పాడారు. అనంతరం టుస్క్ వారికి అభినందించి బహుమతులు అందించారు.

**మూడు రోజుల పర్యటనకు భారత్‌కు విచ్చేసిన టుస్క్**

టుస్క్ అక్టోబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్?కు వచ్చారు. అక్టోబర్ 21న దేశానికి చేరుకున్నారు. మరుసటి రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌లను కలిశారు. పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. అందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం వంటివి ఉన్నాయి. వీటితో పాటు ఇరుదేశాల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. పోలండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించామని మోదీ పేర్కొన్నారు. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించినట్లు చెప్పారు. రష్యా- ఉక్రెయిన్?తో పాటు పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని మోదీ స్పష్టం చేశారు. భారత్, పోలండ్ దేశాలు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని అన్నారు. అదే సమయంలో మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జామ్‌నగర్, కొల్హాపూర్ రాజ కుటుంబాలు పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమివ్వగా, 2022లో ఉక్రెయిన్–రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలండ్ సహకరించిందని మోదీ చెప్పారు.

## ఫ్రాన్స్ నిరసనల్లో అరాచకం.. దుకాణాల లూటీ..

ఫ్రాన్స్‌లో ఇటీవల చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో చోటుచేసుకున్న దుకాణాల లూటీ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. నిరసనకారులు, దుండగులు దోచుకున్న ఖరీదైన లగ్జరీ వస్తువులను ప్రముఖ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకానికి పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో అప్రమత్తమైన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఈ అక్రమ అమ్మకాలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టింది. ఫ్రాన్స్ వాణిజ్య శాఖ మంత్రి సెర్జ్ పాపిన్ ప్రకారం, దేశవ్యాప్తంగా జరిగిన అల్లర్లలో సుమారు 3,000 రిటైల్ దుకాణాలు ధ్వంసం లేదా దోపిడీకి గురయ్యాయి. ముఖ్యంగా పారిస్‌లోని లెస్ హాల్స్ జిల్లాలో ఉన్న హెర్మేస్, లూయిస్ విట్టన్, ది నార్త్ ఫేస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఫ్లాగ్‌షిప్ స్టోర్లు తీవ్రంగా నష్టపోయాయి. దుకాణాల్లో దోపిడీ జరిగిన కొద్ది గంటల్లోనే, డిజైనర్ హ్యాండ్‌బ్యాగులు, ఖరీదైన సౌందర్య సాధనాలు, కాస్మెటిక్స్ వంటివి వింటెడ్, అమెజాన్, లెబాన్‌కాయిన్ వంటి ఆన్‌లైన్ సైట్లలో అమ్మకానికి ప్రత్యక్షమయ్యాయి. ఈ పరిణామంతో ఫ్రాన్స్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. వాణిజ్య మంత్రి సెర్జ్ పాపిన్, డిజిటల్ వ్యవహారాల మంత్రి అన్నే లే హెనాఫ్.. వింటెడ్, అమెజాన్, ఈబే, మెటా, టిక్‌టాక్ వంటి సంస్థల ప్రతినిధులతో అత్యవసర వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయా ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న దొంగసొత్తుకు సంబంధించిన లిస్టింగులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వింటెడ్, తమ ప్లాట్‌ఫామ్‌పై దొంగిలించిన వస్తువుల అమ్మకాల పట్ల “జీరో టాలరెన్స్” విధానాన్ని అనుసరిస్తామని తెలిపింది. తమ సైట్‌లో అసాధారణ రీతిలో లగ్జరీ వస్తువుల లిస్టింగులు పెరిగినట్లు గుర్తించామని, అధికారులతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. మరోవైపు, ఈబే కూడా తమ వద్ద దొంగసొత్తు అమ్మకాలను నిషేధించామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించేందుకు ప్రత్యేక అల్గారిథమ్‌లు, పరిశోధకుల బృందాలు ఉన్నాయని వెల్లడించింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ.. దోపిడీలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఫ్రెంచ్ చట్టాల ప్రకారం, దొంగసొత్తును కలిగి ఉండటం, అమ్మడం లేదా బదిలీ చేయడం వంటి నేరాలకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 375,000 యూరోల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

## వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో ‘అతి తీవ్ర తుపాను’గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు ‘ప్రీ–సైక్లోన్ వాచ్’ జారీ చేసింది. న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ–వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29–30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్–జూలియన్ ఆసిలేషన్ (ఎంజేఓ) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు. ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

## మోదీ ఫొటోకు క్షుద్రపూజలు!

ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ఉపయోగించి, శ్మశానవాటిక సమీపంలో క్షుద్రపూజలు చేస్తున్నట్లు ఉన్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనితో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. “సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో, దోరిఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సరయూ నదీ తీరాన ప్రధాని మోదీ ఫొటో చుట్టూ కొబ్బరికాయలు, నిమ్మకాయలు పెట్టారు. నారింజ రంగు పొడితో ముగ్గులు వేసి ఉన్నాయి. ఈ వీడియో ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నాం. ఘటన జరిగిన ప్రదేశం నుంచి కూడా ఆధారాలు సేకరిస్తున్నాం. అలాగే చుట్టుపక్కల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. గుర్తు తెలియని నిందితులపై భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం” అని ఘోసీ సర్కిల్ ఆఫీసర్ సత్యేంద్ర భూషణ్ తివారీ చెప్పారు. నదీతీరాన ప్రధాని ఫొటోను, పూజా సామగ్రిని ఎవరు ఉంచారు సోషల్ మీడియాలో ఈ వీడియో ప్రచారం చేయడం వెనుకున్న వారి ఉద్దేశం ఏమిటి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు..

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై ప్రభుత్వాలు సాగిస్తున్న పోరాటం సత్ఫలితాలనిస్తోంది. శనివారం నాడు (అక్టోబరు 24) నగరంలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 191 వద్ద ‘మోడరేట్’ కేటగిరీలో నమోదైందని, ఇది గత దశాబ్ద కాలంలో నమోదైన అత్యుత్తమ గాలి నాణ్యత అని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. కోవిడ్–19 ప్రభావిత కాలాన్ని మినహాయిస్తే, పదేళ్లలో ఇదే అత్యంత మెరుగైన ఏక్యూఐ అని ఆయన అన్నారు. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న నిరంతర పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. గత గణాంకాలను పరిశీలిస్తే, అక్టోబర్ 24న 2024లో ఏక్యూఐ 306గా, 2025లో 275గా నమోదైందని, ఈ ఏడాదది 191కి తగ్గడం గణనీయమైన పురోగతిని సూచిస్తోందని మంత్రి వివరించారు. కాలుష్య నివారణకు చేపట్టిన స్థిరమైన చర్యలు, కఠినమైన అమలు, వివిధ ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయంతో కూడిన జోక్యం వల్లే ఈ సానుకూల మార్పు సాధ్యమైందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా నాయకత్వంలో ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు సమగ్రమైన, కార్యాచరణ–ఆధారిత విధానాన్ని అవలంబిస్తోందని సిర్సా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిబంధనల అమలు, రెగ్యులర్ తనిఖీలు, జిల్లా స్థాయి సమీక్షలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ వంటి బహుముఖ వ్యూహాలతో కాలుష్య కారకాలను మూలాల వద్దే అరికట్టడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. గాలి నాణ్యతలో ఈ మెరుగుదల ప్రభుత్వ నిరంతర కృషి, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఢిల్లీ నివాసితుల సమష్టి సహకారం వల్లే సాధ్యమైందని మంత్రి అన్నారు. స్వచ్ఛమైన గాలి కోసం సాగుతున్న ఈ ప్రచారానికి మద్దతిస్తున్న ఢిల్లీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గాలి నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. జవాబుదారీతనం, సమర్థవంతమైన అమలు, ప్రజా భాగస్వామ్యంతో ఈ ప్రచారాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తామని సిర్సా పునరుద్ఘాటించారు. కాలుష్య నివారణ చర్యలను ముమ్మరం చేయడంలో భాగంగా, గత 24 గంటల్లో ప్రభుత్వం చేపట్టిన కీలక చర్యల వివరాలను కూడా వెల్లడించారు. వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు 9,883 వాహనాలకు చలాన్లు విధించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి 12,702 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారు. రోడ్లపై దుమ్ము ధూళిని నియంత్రించేందుకు 1,075 కిలోమీటర్ల మేర నీటిని చల్లారు. 2,223 మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించడంతో పాటు, 2,810 కిలోమీటర్ల రోడ్లను మెకానికల్ స్వీపింగ్ ద్వారా శుభ్రం చేశారు.

# 9, 21వ వార్డుల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సతీమణి త్రివేణి

ప్రజలతో మమేకమవుతూ.. ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి సతీమణి త్రివేణి ప్రచారం

ప్రజల సమస్యలపై ఆరా తీస్తూ.. ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతు కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన త్రివేణి

ప్రజలు తెలిపిన మౌలిక సదుపాయాల సమస్యలను మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ

అభివృద్ధికి అండగా నిలవండి.. ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించండి

కమలం, సైకిల్ గుర్తులకు ఓటేసి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించండి



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 25** ధర్మవరం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రి, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ గారి సతీమణి త్రివేణి ఆదివారం ఉదయం 9వ, 21వ వార్డుల్లో పర్యటించారు. బీజేపీ తరఫున పోటీ చేస్తున్న 9వ వార్డు అభ్యర్థి తులసి దాస్, 21వ వార్డు అభ్యర్థి దాసరి అఖిలతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. అభ్యర్థులకు మద్దతు కోరడంతో పాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ప్రజల సమస్యలపై ప్రత్యేకంగా ఆరా...**

ఎన్నికల ప్రచారంలో భాగంగా త్రివేణి ఆయా వార్డుల ప్రజలతో మాట్లాడిన సమయంలో స్థానికంగా ఎదురవుతున్న మౌలిక సదుపాయాల సమస్యలను పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఆమె శ్రద్ధగా వింటూ, వాటి వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని త్రివేణి వారికి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులతో మాట్లాడతామని భరోసా ఇచ్చారు.

**కమలం గుర్తుకు ఓటేసి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి...**

9వ వార్డు బీజేపీ అభ్యర్థి తులసి దాస్, 21వ వార్డు బీజేపీ అభ్యర్థి దాసరి అఖిలలను కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయా వార్డుల ప్రజలను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించి, వార్డుల అభివృద్ధికి కృషి చేసే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలను తెలుసుకుంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా ధర్మవరం మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్డీఏ కూటమి తరఫున పోటీ చేస్తున్న పరిశే సుధాకర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని త్రివేణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు చైర్మన్ అభ్యర్థికి కూడా ప్రజలు తమ మద్దతు అందించాలని, ధర్మవరం పట్టణ అభివృద్ధికి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పుట్టపర్తిలో పీజీఆర్ఎస్ రద్దు

**జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి అక్టోబర్ 25:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దృష్ట్యా ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల నిబంధనావళి (ఎలక్షన్ కోడ్) అమలులో ఉన్నందున, పుట్టపర్తిలో నిర్వహించే ప్రజల ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం పీజీఆర్ఎస్ ను రద్దు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఈ పీజీఆర్ఎస్ రద్దు నిర్ణయం అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయి, ఎన్నికల కోడ్ ఉపసంహరించుకున్న తర్వాత తిరిగి పీజీఆర్ఎస్ యథావిధిగా ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## టిడిపి ఎంపీటీసీ జడ్పిటిసిలను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

**టిడిపి మహిళా నాయకురాలు మన్నేరు కొండమ్మ పరమేష్**



బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ అక్టోబర్ 25 మండలంలో జడ్పిటిసి ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం తరపున ఎన్నికల్లో నిలబడిన ప్రతి ఒక్కరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు మన్నేరీ కొండమ్మ పరమేశ ప్రజలను కోరారు అన్ని వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## స్థానిక సంస్థల్లో విజయం సాధించాలని అభ్యర్థులను కోరిన ఎమ్మెల్యే,ఇన్చార్జి మనోజ్





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 25:** అనపర్తి నియోజవర్గం నాలుగు మండలాల నుండి రాబోవు స్థానిక సంస్థలలో పోటీ చేస్తున్న జడ్పిటిసి మరియు ఎంపిటీసీ అభ్యర్థులతో నేడు అనపర్తి ూచీ= ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు మరియు కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విధంగానే స్థానిక సంస్థలు ఎన్నికలలో కూడా కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించాలి అని 100% స్ట్రైక్ రేట్ తో విజయం సాధించాలని ఆకాంక్షించారు. వైఎస్ఆర్సిపి పాలనలో నియోజకవర్గం ఏవిధంగా అభివృద్ధిలో వెనుకబడిపోయిందో వివరిస్తూ గడిచిన రెండేళ్ళలో కూటమి పరిపాలనలో ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుంది అనే విషయాలు ప్రజలకు వివరించాలని, నాయకులు అంతా ఐక్యమత్యంతో పనిచేసి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరారు. వైఎస్ఆర్సిపి సరైన అభ్యర్థులు లేక సతమతమవుతుందని అసలు అభ్యర్థులను ప్రకటించే సాహసం కూడా చేయలేకపోతుందని, కూటమి అభ్యర్థుల విజయం ఖాయం అని ఆయన అన్నారు.

# రేపు తాడిపత్రి ఉరవకొండ గుత్తి నియోజకవర్గం యువ క్రికెటర్లకు రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ ఫేస్ క్రికెట్ సెలక్షన్స్ అక్టోబర్ 26న అనంతలో ప్రారంభం

**సెలక్షన్ అయిన యువ క్రికెటర్లు చిన్నారులు పాల్గొనండి**




**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 25** అనంతపురం జిల్లాలోని అనంతపురం పట్టణం లో =ఖ మైదానం నందు బాలుర యువ క్రికెట్ సెలక్షన్స్ అక్టోబర్26తారీఖున ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది బాలుర క్రికెట్అండర్ 15 సెలక్షన్లు జరుగునులిఅని డైరెక్టర్ సాయి కృష్ణ తెలిపారు

రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ =ఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని ప్రతిభ ఉన్న గ్రామీణ క్రికెటర్లను గుర్తించే కార్యక్రమం తీసుకోవడం జరిగింది ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ పేరుతో జిల్లా వ్యాప్తంగా చిన్నారులు బాలుర క్రికెట్ సెలక్షన్లు నిర్వహించడం జరిగింది అందులో ప్రతిభ చూపిన యువ క్రికెటర్లను రెండవ పేస్ సెలక్షన్లకు ఎంపిక చేయడం జరిగింది వారం రోజులు పాటు నిర్వహించడం జరుగుతున్నదిఅందులో భాగంగా ఈరోజు తాడిపత్రి ఉరవకొండ గుత్తి నియోజకవర్గం నుంచిఎంపికైన క్రికెటర్లకు రెండవ పేస్ సెలక్షన్లు నిర్వహించడం జరుగుతుందిఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి పర్యవేక్షణలో జరుగుతుంది ఇందులో సెలక్షన్ కమిటీ సభ్యులు ప్రదీప్, విజయరాజు యోగానంద ప్రశాంత్ కుమార్ రెడ్డి ప్రవీణ్ కో ఆర్డినేటర్ గ్రాస్ రూట్ లెవెల్ ఆర్డిటి ప్రతినిధి తదితరులు పాల్గొని పర్యవేక్షించి ఎంపిక చేస్తారు అని డైరెక్టర్ సాయి కృష్ణ అన్నారు

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి ఉరవకొండ గుత్తి నియోజకవర్గం లో 15 సంవత్సరాల లోపు మూడు నియోజకవర్గ నుంచి ఎంపికైన యువ క్రికెటర్లు మాత్రమే ఈ ఎంపికలో పాల్గొనాలని ఆసక్తి గలవారువైట్ డ్రెస్సు షూస్ యూనిఫామ్ తో తప్పకుండా రావాలి సొంత క్రికెట్ కిట్టు తో హాజరు కావలసి ఉంటుంది

ఎంపికైన యువ క్రికెటర్ నేరుగా మైదానంకు వచ్చి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకొనవచ్చును

సాయి కృష్ణలి

డైరెక్టర్=ఖ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ తెలిపారు

## యువ క్రికెటర్లను తయారు చేయడమే ఆర్డిటి ధ్యేయం

**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధిఅనంతపురం, అక్టోబర్ 25 –** గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది అనంతపురం జిల్లాలో యువ క్రికెటర్లు ఉన్నారనియువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి క్రికెటర్లను తయారు చేయాలన్న ఉద్దేశంతో అనంతపురం జిల్లాలోని 14 కేంద్రాలలో ఆర్డిటి నిర్వహించిన రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ లో రెండు వేల మంది పైగా యువ క్రికెటర్లు పాల్గొనడం జిల్లా క్రికెట్ చరిత్రలో ఇది ఒక రికార్డ్ అని భవిష్యత్తులో జిల్లాలో యువ క్రికెటర్లకు కొరత లేదని ఈ కార్యక్రమం నిరూపించిందని రాబోవు రోజుల్లో క్రికెట్లో రాణించి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయి రంజీ క్రీడాకారులు కావాలన్నదే ఆర్డిటి మంచో ఫెర్రర్ లక్ష్యం అని అందుకోసం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించే కార్యక్రమాన్ని మంచో ఫెర్రర్ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లాలోని యువ క్రికెటర్లందరూ ఉపయోగించుకున్నారని ఇది ఒక మంచి శుభ పరిణామం అని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు అనంతపురం నగరంలోని ఆర్డిటి క్రీడా గ్రామంలోని క్రీడా మైదానం నందు ఆర్‌డిటి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ ఫేస్ ప్రారంభోత్సవం జరిగింది ఉదయం ప్రతిభాన్వేషణ ఎంపికలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి, సెలెక్టర్లు ప్రదీప్, యోగానంద, విజయ్ రాజు, ప్రశాంత్ రెడ్డి , ఆర్‌డిటి గ్రాస్‌రూట్స్ కోఆర్డినేటర్ కె. ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి యువ క్రికెటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఆర్‌డిటి ఈ నూతన చొరవ తీసుకుందని, ప్రతిభాన్వేషణ కోసం అనంతపురం నగరంలోని చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్నటువంటి యువ క్రీడాకారులు సమావేశమవడం ఆనందంగా ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి కోచింగ్ శిబిరాలకు పంపుతున్నామని తెలిపారు. అనంతపురం నుంచి ప్రతిభ ఉన్న ఎందరో క్రికెటర్లు ఆర్డిటి స్టేడియం ను ఉపయోగించుకొని రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కాగలిగారని, టాలెంట్ హంట్ ఎంపికల ద్వారా ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తిస్తున్నామని, గ్రామీణ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు సరైన క్రికెట్ సౌకర్యాలను వినియోగించుకునేలా చూడటానికి మాజీ భారత, ఆంధ్ర ఆటగాళ్లతో కలిసి చీజూ, రాష్ట్ర జట్ల శిబిరాల వంటి శిబిరాలను నిర్వహించాలనుకుంటున్నామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించి, వారికి మరింత శిక్షణ ఇవ్వడమే మంచో ఫెర్రర్ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి క్రికెట్ కోచ్ లు రఫీ హరినాథ్ రెడ్డి , రాజశేఖర్ ఇనైతుల్లా, సాల్మ తదితరులు పాల్గొన్నారు

## అనంతలో తెలుగుదేశం జెండా ఎగరాలి

**అనంతపురంలో జిల్లా ఎమ్మెల్యేల సమావేశం**

**స్థానిక సంస్థల ఎన్నికలు, రాజకీయ అంశాలపై చర్చించిన కూటమి నేతలు**



**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 25** అనంతపురం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు మున్సిపల్ స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించే విధంగా ఎమ్మెల్యేలు మంత్రులు ప్రజాప్రతినిధులు కూటమినేతలు ఐకమత్యంగా కృషిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాప్రతినిధులకు సూచించారు అనంతపురం నగరంలోని మాసినేని గ్రాండ్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ , మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యేల సమావేశంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గారు, ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు , దగ్గుపాటి ప్రసాద్ , బండారు శ్రావణి శ్రీ , అమిలినేని సురేంద్ర బాబు , బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ , జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వ లక్ష్యాలు, స్థానిక సంస్థల ఎన్నికపై చర్చించినట్లు పూల నాగరాజు గారు తెలిపారు.

## వార్డులో టీడీపీ ప్రచారం జోరు జోరు



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 25** ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్న గారి ఆదేశాల మేరకు 17వ వార్డ్ లో తెలుగుదేశం పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థితో పాటు ప్రచారం చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు కిరోసిన్ పోతలయ్య మాట్లాడుతూ యువ నేత పరిటాల శ్రీ రామ్ పిలుపు మేరకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలు నిజం చేయాలనీ అన్నారు ధర్మవరం తెలుగుదేశం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పరిసే సుధాకర్ గెలుపు కోసం ప్రచారం చేశామన్నారు

## గిరక శ్రీ నాథ్ కు ఘనంగా నివాళులు

**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 25** ధర్మవరం మండలం గొట్లూరు గ్రామ యువకుడు గిరక శ్రీ నాథ్ కు పలువురు మిత్రులు శ్రేయోభిలాషులు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ యువకుడు జయంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం అనాథ ఆశ్రమం లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో గిరక చిరంజీవి శ్రీ మతి నిర్మల పవన్, దాసరి రామాంజనేయులు రాజు ఆనంద్ భాస్కర్ ధోని నాని, తదితరులు పాల్గొన్నారు

## ధర్మవరం మున్సిపల్ ఎన్నికల ముఖచిత్రం




**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 25** ధర్మవరం మున్సిపల్ ఎన్నికల వివరాలుమున్సిపాలిటీ: ధర్మవరం కూటమి చైర్మన్ అభ్యర్థి: పరిసే సుధాకర్ (టీడీపీ) వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థి: కాచర్ల ఆంజనేయులు చైర్మన్ అభ్యర్థుల సంఖ్య: 8 కౌన్సిలర్ అభ్యర్థుల సంఖ్య: 150 మొత్తం వార్డులు: 48 పోలింగ్ కేంద్రాలు: 134 మొత్తం ఓటర్లు: 1,06,256 పోలింగ్ తేదీ: నవంబర్ 1 ఓట్ల లెక్కింపు, ఫలితాలు: నవంబర్ 3

# ఆర్యవైశ్యుల అండతోనే నగర అభివృద్ధి సాధ్యం





## కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్, దగ్గుబాటికూటమి పార్టీల కీలక నాయకులు

## చెరువుకట్టను ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తాం

**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 25** అనంతపురం అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర చాలా ఉందని, వారి సహకారంతోనే నగరాభివృద్ధి సాధ్యమని ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ జిల్లా పార్టీ ఇన్చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతూరు అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మధుసూదన్ గుప్తా, పార్థసారథి, బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, ఆర్యవైశ్య ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి, ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు, ప్రతినిధులు, కూటమి పార్టీల కీలక నాయకులు హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన నాయకులకు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపార వర్గాలు ఘన స్వాగతం పలికారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, వాసవీ క్లబ్ ప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, పాతూరు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులపై ప్రశంసల జల్లు కురిపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆర్యవైశ్యులంతా ఏకతాటిపై నిలిచి కూటమికి వన్ సైడ్ గా ఓట్లు వేశారన్నారు. ఆర్యవైశ్యుల నివాస ప్రాంతాల్లో ఏకంగా 98 శాతం ఓట్లు కూటమికి పడ్డాయని, తనకు 23 వేల ఓట్ల భారీ మెజారిటీ రావడంలో ఆర్యవైశ్యుల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృతజ్ఞతాపూర్వకంగా గుర్తుచేసుకున్నారు. ఆర్యవైశ్యులు మొదటి నుంచి కూటమి పార్టీల వెంటే నడుస్తున్నారని, ఇప్పుడు నగరంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బలంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతపురం నగరంలో ఎన్డీఏ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి అజేష్ భారీ మెజారిటీతో గెలిస్తే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చల్లని చూపు, ప్రత్యేక ఆశీస్సులు అనంతపురంపై ఉంటాయన్నారు. అలాగే కేంద్రంలో పట్టున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ అండదండలు, సహకారం మనకు ఖచ్చితంగా ఉంటాయని, తద్వారా ఢిల్లీ నుండి నేరుగా భారీ నిధులు తెచ్చి నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు. కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ గెలిచిన వెంటనే నగరంలోని చెరువు కట్టను హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో సర్వాంగ సుందరంగా మార్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నగర పారిశ్రామిక, వ్యాపార రంగాల అభివృద్ధి కోసం అనంతపురానికి విమానాశ్రయం తీసుకురావాలన్న ప్రతిపాదనను ఇప్పటికే ప్రభుత్వం ముందు పెట్టామని, అది కూడా త్వరలోనే సాకారం కాబోతోందని వెల్లడించారు. పెరిగిన ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు, దశాబ్దాల సమస్య అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని కూడా తీసుకువస్తామన్నారు. భవిష్యత్తులో అనంతపురంలో 'డంపింగ్ యార్డ్' అనే మాటే లేకుండా చేసేందుకు 15 కోట్ల భారీ వ్యయంతో అత్యాధునిక 'ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్'ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గత ఐదేళ్ల వైసిపి పాలన అత్యంత అస్తవ్యస్తంగా సాగిందని, నగరంలో కనీసం ఎక్కడా కొత్త రోడ్లు, డ్రైనేజీలు గానీ వేయని దౌర్భాగ్య స్థితిని చూశామని ఎమ్మెల్యే అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం అత్యంత సమర్థవంతమైన, పారదర్శకమైన పాలన జరుగుతోందని చెప్పారు. ఆర్యవైశ్యులంతా సంపూర్ణంగా సహకరించి మేయర్ అభ్యర్థితో పాటు నగరంలోని 62 స్థానాల్లోనూ కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి త్వరలోనే మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రమాణస్వీకారం కూడా చేయబోతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

# అవినీతి రహిత పాలనకు ఆప్ నాలుగు గ్యారెంటీలు చీపురు గుర్తుకు ఓటేయండి.. వెంకటరమణ



**(అంకుశం న్యూస్ -- రాయదుర్గం, అక్టోబర్ 25):** రాయదుర్గం మున్సిపాలిటీలో అవినీతికి అడ్డుకట్ట వేసి, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బి. వెంకటరమణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కనేకల్ రోడ్డు, లక్ష్మీ బజార్, బీటీపీ రోడ్డు, బళ్లారి రోడ్డు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న నాలుగు ప్రధాన హామీలను ప్రజలకు వివరించారు.

**అవినీతికి అడ్డుకట్ట వేస్తాం**

మున్సిపల్ కార్యాలయాల్లో లంచాలు అడిగితే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక చైర్మన్ హెల్ప్లైన్ ఏర్పాటు చేస్తామని వెంకటరమణ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు.

**ఇంటి వద్దకే మున్సిపల్ సేవలు**

ధ్రువపత్రాలు, ఆస్తుల మ్యుటేషన్ తదితర పనుల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే మున్సిపల్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవన నిర్మాణ అనుమతులను పారదర్శకంగా, ఆన్లైన్ విధానంలో నిర్ణీత గడువులో అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**మహిళా సంఘాలకు ప్రాధాన్యత**

మెప్మా మహిళా సంఘాలకు సంబంధించిన పొదుపు, రుణాల లావాదేవీల్లో పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకుంటామని వెంకటరమణ తెలిపారు. లబ్ధిదారులకు అందాల్సిన నిధుల్లో అక్రమాలకు తావులేకుండా చూస్తామని పేర్కొన్నారు.

**చీపురు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి**

రాయదుర్గం పట్టణంలో నిజాయితీతో కూడిన పాలన, మెరుగైన మున్సిపల్ సేవలు, అభివృద్ధి సాధించాలంటే ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశం ఇవ్వాలని వెంకటరమణ ప్రజలను కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ చీపురు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం





## ఎంపీ కేశినేని చిన్ని విస్తృత ప్రచారం

## 32, 33, 55వ డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం

**అంకుశం న్యూస్ విజయవాడ అక్టోబర్ 25** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 32, 33, 55వ డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్ఛార్జ్ బుద్ధ వెంకన్నతో కలిసి ఆయా డివిజన్లలో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. 32వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సురభి శైలజ, 33వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి స్నేహ, 55వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పెద్ది రమేష్తో పాటు విజయవాడ కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ విజయానికి మద్దతుగా ఎంపీ కేశినేని చిన్ని ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి విజయవాడ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**33వ డివిజన్లో ఎంపీ చిన్ని, కూటమి నాయకులకు ఘన స్వాగతం**

33వ డివిజన్లో ఎంపీ కేశినేని చిన్ని ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు కాజా ఆధ్వర్యంలో నాయకులు, స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎంపీ చిన్ని, కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు.

**ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఏ విధంగా నెరవేరుస్తోందో ప్రజలకు వివరిస్తూ ఎంపీ కేశినేని చిన్ని ప్రచారం కొనసాగించారు. విజయవాడ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కూటమి ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కార్పొరేటర్ అభ్యర్థులు, మేయర్ అభ్యర్థి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ప్రతి డివిజన్ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**మైనారిటీల సమస్యల పరిష్కారానికి కూటమి కట్టుబడి ఉంది**

మైనారిటీ వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారని ఎంపీ చిన్ని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ నగరం సర్వమత సమ్మేళనానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, అన్ని మతాలు, వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

**కూటమి అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల నాయకులు సమష్టిగా కృషి చేయాలి**

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతను చాటుతూ ప్రజల్లోకి వెళ్లి అభ్యర్థులకు మద్దతు కూడగట్టాలని సూచించారు. విజయవాడ నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ విజయవాడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు.

# ధర్మవరం లో సైకిల్ జోరు గా ప్రచారం



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 25** ధర్మవరం 04వ వార్డులో కూటమి అభ్యర్థులకు పరిసే సుధాకర్ గారికి మద్దతుగా ప్రచారం ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ శ్రీ పరిటాల శ్రీరామ్ గారు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ గారు, జనసేన ధర్మవరం పట్టణ అధ్యక్షులు శ్రీ మధుసూదన్ రెడ్డి గారు కూటమి అభ్యర్థులకు మద్దతుగా ధర్మవరం పట్టణంలోని 4వ వార్డు శాంతినగర్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పరిసే సుధాకర్ గారికి, అలాగే 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మేకల లోకేష్ గారికి ప్రజలు తమ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుకు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు.

# ఊపందుకున్న వైసిపీ ప్రచారం!



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 25** ధర్మవరం పట్టణం,41వ వార్డు(మారుతీనగర్)"వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ","శ్రీ.కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గారి ఆశీస్సులతో" మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థి-శ్రీమతి.యర్ర గుంట్ల.భాగ్యలక్ష్మి గారు,(ఫ్యాన్ గుర్తు),మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి-కాచర్ల ఆంజనేయులు గారి గుర్తు"ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి అఖండ మేజారిటితొ గెలిపించాలని ప్రచారం చేస్తున్న-యర్రగుంట్ల. భాగ్యలక్షి, బడన్నల్లి. కేశవరెడ్డి,అనిల్ రెడ్డి,చందన రెడ్డి,దేవరకొండ రమేష్,క్రిష్ణారెడ్డి,శివ రాయల్,విశ్వనాధ్ రాజారెడ్డి,శేఖర,క్రిష్ణమూర్తి,మహిళా నాయకురాల్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికలు ముగిసేవరకు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు..

– : జిల్లా ప్రజలు గమనించాలి

: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



**అంకుశం న్యూస్అనంతపురం, అక్టోబర్ 25 :** – అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోస్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు ఎవరూ రాకూడదని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

# ఎన్నికలు ముగిసేవరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు..

**– : జిల్లా ప్రజలు గమనించి సహకరించాలి.. జిల్లా ఎస్పీ పి.జగదీష్**




**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం అక్టోబర్ 25** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోస్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఖూా గారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు ప్రజలెవరూ జిల్లా పోలీసు కార్యాలయానికి రాకూడదని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు.